క్లుప్తంగా

విత్తన వేరుశనగ దుర్వినియోగం చేస్తే చర్యలు



గంతిమర్రి ఆర్బీకే వద్ద రైతులకు వేరుశనగ పంపిణీ చేస్తున్న ఏఓ, ఇతర సిబ్బంది

రామగిరి(చెన్నేకొత్తపల్లి): ప్రభుత్వం సబ్సిడీపై అందించే విత్తన వేరుశనగ కాయలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఏఓ మురళీ కృష్ణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గంతిమర్రి రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాయితీ ద్వారా తీసుకున్న విత్తన వేరుశనగ కాయలను రైతులు విక్రయించినా, దుర్వినియోగం చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో గంతిమర్రి ఎంపీటీసీ రామ్మోహన్, కలికివాండ్లపల్లి రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

బత్తలపల్లి: బత్తలపల్లి–ధర్మవరం రహదారిపై మద్యం దుకాణం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన సమాచారం.. బత్తలపల్లిలోని గుడిసెల్లో నివాసముంటున్న ఓ బాలుడు టీవీఎస్ ఎక్స్ఎల్ వెళ్తూ అకస్మాత్తుగా కుడివైపునకు వాహనాన్ని తిప్పాడు. దీంతో అతడి వెంట వస్తున్న మండల కేంద్రానికి చెందిన కోటి నాగరాజు బైక్‌ను స్లో చేశాడు. అయితే అతడి వెనుక బైక్‌పై వస్తున్న సాయినాథ్‌రెడ్డి నాగరాజు బైక్‌ను ఢీకొన్నాడు. ఘటనలో కోటి నాగరాజు, సాయినాథ రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



తంబాపురంలోని ఓ ఇంటిలో సోదాలు చేస్తున్న పోలీసులు

బత్తలపల్లి: గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం తంబాపురంలో కార్డన్ సెర్చ్‌తో పాటు, ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అనుమానితులు, మద్యం విక్రేతల ఇళ్లలో సోదాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు.

పుట్టపర్తిలో కార్డెన్ సెర్చ్



కల్పవృక్షం ప్రాంతంలో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

పుట్టపర్తి రూరల్: పట్టణంలోని చిత్రావతి గుట్ట, కల్పవృక్షం ఏరియాలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ వాసుదేవన్ ఆధ్వర్యంలో సీఐ కొండారెడ్డి సిబ్బందితో కలసి అనుమానాదస్పద ఇళ్లు, ప్రదేశాలు, పాత నేరస్తులు, రౌడీ షీటర్ల ఇళ్లల్లో అణువణువునా సోదాలు చేపట్టారు. రికార్డులు లేని 6 బైకులు, 6 ఇనుప రాడ్లు, మారణాయుధాలు సీజ్ చేశారు. జూన్ 4 న జరగనున్న ఓట్లు లెక్కింపు ముందు తరువాత ఎటువంటి అల్లర్లు పాల్పడకూడదని ప్రశాంతంగా ఉండాలని లేని పక్షంలో చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

బీసీ హాస్టల్ వార్డెన్‌కు సన్మానం

ముదిగుబ్బ: స్థానిక బీసీ హాస్టల్ వార్డెన్ నారాయణమ్మ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈసందర్భంగా హాస్టల్ ఏర్పాటు చేసిన వీడ్కోలు సభకు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి నిర్మలజ్యోతి హాజరై నారాయణమ్మ సేవలను కొనియాడారు. అనంతరం వార్డెన్‌ను అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ధర్మవరం ఏబీసీడబ్ల్యూఓ రంగమ్మ, బీసీ హాస్టల్ వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మస్తాన్, ప్రధాన కార్యదర్శి కుళ్లాయస్వామి, కోశాధికారి ఠాగూర్, వార్డెన్లు మారుతిప్రసాద్, రాజశేఖర్ నాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

తలుపుల: మండలంలోని ఏపులపల్లిలో ఓ వివాహిత అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పద్మజ (26) బుధవారం ఉదయం ఇంటి నుంచి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బాధితురాలి భర్త రెడ్డెప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకే వేరుశనగ

- విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభం



బత్తలపల్లి మండలం మాల్యవంతంలో రైతులకు వేరుశనగ కాయలు పంపిణీ చేస్తున్న ఏఓ ఓబిరెడ్డి



కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో విత్తన కాయలు పంపిణీ చేస్తున్న దృశ్యం



కొత్తచెరువు మండలం భైరాపురంలో విత్తనకాయలు పంపిణీ చేస్తున్న ఏఓ నటరాజ్



పోతుకుంటలో విత్తన కాయలను పంపిణీ చేస్తున్న ఏడీఏ కృష్ణయ్య

బత్తలపల్లి: రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామని ఏఓ ఓబిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులకు ప్రభుత్వం 40 శాతం రాయితీతో వేరుశనగ విత్తన కాయలను 30 కిలోల బస్తా రూ.1,710 చొప్పున అందిస్తోందన్నారు. ఒక్కో రైతుకు పాసు పుస్తకంపై మూడు బస్తాలను ఇస్తామన్నారు. మండలానికి 2,200 క్వింటాళ్లు కె–6 విత్తన వేరుశనగ కాయలు కేటాయించినట్లు తెలిపారు. తొలిరోజు మండలంలోని 8 రైతు భరోసా కేంద్రాలలో 697 మంది రైతులకు 627 క్వింటాళ్ల విత్తన కాయలను పంపిణీ చేసినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఆయా రైతు భరోసా కేంద్రాలల్లోని గ్రామ వ్యవసాయాధికారులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: తాడిమర్రి, నార్శింపల్లి, పెద్దకోట్ల, ఎం.అగ్రహారం, కునుకుంట్ల తదితర మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో మొదటి రోజు 808 మంది రైతులకు 722.4 క్వింటాళ్ల విత్తన కాయలు పంపిణీ చేసినట్లు ఏఓ రమాదేవి తెలిపారు. విత్తనం కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు అందరికి తప్పకుండా పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వీఎస్‌ఏ విజయ్‌భాస్కర్, వీహెచ్‌ఏ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకున్న రైతులందరికీ విత్తన వేరుశనగ అందిస్తామని ఎంపీడీఓ మోహన్‌కుమార్, మండల వ్యవసాయాధికారి ఉదయ్‌కుమార్ తెలిపారు. బుధవారం వారు మండల పరిధిలోని పది రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ, మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాలకు 1,300 క్వింటాళ్ల రాయితీ విత్తన వేరుశనగ కాయలు వచ్చాయని తెలిపారు. ఇప్పటి వరకూ 1,316 మంది రైతులు 1,170 క్వింటాళ్ల విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. వీరందరికీ విత్తనం పంపిణీ చేసినట్లు ఏఓ తెలిపారు. వేరుశనగ పంటలో అంతర పంటగా కంది సాగుచేసుకోవచ్చని, కంది విత్తనం కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు.

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి రైతు భరోసాకేంద్రం వద్ద బుధవారం వ్యవసాయశాఖాధికారులు రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేశారు. ఏడీఏ సత్యనారాయణ, తహసీల్దార్ పుల్లారెడ్డి, ఏఓ శ్రీనివాసరెడ్డి రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేశారు. కదిరి మండలానికి సంబంధించి 2,839 క్వింటాళ్ల విత్తన కాయలు మంజురు చేసినట్లు ఏఓ తెలిపారు. ఇందులో కే–6 రకం 2669 క్వింటాళ్లు, కదిరి లేపాక్షి 110, విశిష్ట 60 క్వింటాళ్లు ఉన్నాయన్నారు. రైతులు తమ వెంట పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్ తప్పక తీసుకుని రావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజనప్ప, రైతు భరోసా సిబ్బందితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎన్పీకుంట: రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రతి రైతుకు నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ నరేంద్రకుమార్, ఏఓ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎన్.పీ.కుంట–1, 2 రైతు భరోసా కేంద్రాలతో పాటు మండలంలోని అన్ని ఆర్బీకేలలో విత్తన బుధవారం విత్తనకాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న 10 ఆర్బీకే లకు 3,000 క్వింటాళ్ల వేరుశనగ, 50 క్వింటాళ్ల కందులు, 5 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో 2,263 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలకోసం 2,026 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ శిరీషా, వీఏఏలు యుగంధర్, ధనలక్ష్మి, ఆంజినాయక్, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లో బుధవారం విత్తన వేరుశనగ పంపిణీని అధికారులు ప్రారంభించారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ రామానాయక్ విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏఓ లక్ష్మీప్రియ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో పరిశీలించి నాణ్యమైన విత్తన కాయలను తీసుకోవాలని సూచించారు. మండల వ్యాప్తంగా 7 రైతు భరోసా కేంద్రాల్లో 1,583 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వారికి 1,383.90 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేసినట్లు చెప్పారు. 7 రైతు భరోసా కేంద్రాలకు 2250 క్వింటాళ్ల విత్తన వేరుశనగ అవసరం కాగా 1,002 క్వింటాళ్లు ఇప్పటికే ఆయా కేంద్రాలకు చేరాయన్నారు. రైతులు ఎవరూ ఇబ్బంది పడకుండా కావాల్సిన రైతులు 40 శాతం సబ్సిడీతో తీసుకువెళ్లచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రతాపనాయక్, ఎంపీఈఓ క్రిష్ణమోహన్ పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల వ్యాప్తంగా బుధవారం అధికారులు విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నల్లచెరువు ఆర్బీకే–2 లో ఎంపీడీఓ రాణెమ్మ, ఎస్‌ఐ కె.ఎం.లింగన్న, ఏఓ భారతి రైతులకు విత్తణ కాయలు పంపిణీ చేశారు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు గురువారం నుంచి విత్తన కాయలను పంపిణీ చేయనున్నట్లు ఏఓ భారతి తెలిపారు. వీఏఏలు భాస్కర్ నాయక్, సాజాద్, రైతులు పాల్గొన్నారు.

తనకల్లు: తనకల్లు–1 రైతు భరోసా కేంద్రంలో బుధవారం తహసీల్దార్ శోభాసువర్ణమ్మ, ఏఓ శ్రీహరి నాయక్ చేతుల విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి 4,617 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలు మంజూరయ్యాయని, ఇందులో 4557 క్వింటాళ్లు కే–6 రకం, 30 క్వింటాళ్లు లేపాక్షి, 30 క్వింటాళ్లు వశిష్ఠ రకానికి చెందినవని తెలిపారు. ప్రతి రైతుకు గరిష్టంగా 3 బ్యాగులు అందిస్తారని, వీటికి సబ్సిడీ పోగా కే–6 రకానికి ఒక బస్తాకి (30 కేజీలు) రూ.1710, రెండు బస్తాలకు రూ.3420, మూడు బస్తాలకు రూ.5,130 కట్టాలని అలాగే కదిరి లేపాక్షి రకానికి ఒక బస్తా (30 కేజీలు) రూ.1,566, రెండు బస్తాలకు రూ.3132, మూడు బస్తాలకు రూ.4,698 చెల్లించాలని వివరించారు.

కొత్తచెరువు: మండల వ్యాప్తంగా రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి నటరాజ్ తెలిపారు. బుధవారం భైరాపురం రైతు భరోసాకేంద్రంలో విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 10 రైతు భరోసా కేంద్రాలకు 800 క్వింటాళ్లు సరఫరా కాగా మెదటిరోజు 650 క్వింటాళ్ల విత్తన కాయలను 720 మంది రైతులకు పంపిణీ చేశామన్నారు. ఈ ఏడాది తొలకరి వర్షాలు ముందస్తుగా పలకరించడంతో రైతులు ఉత్సాహంగా కాయలు కొనుగోలు చేస్తున్నారని, జూన్ మెదటి వారం నుంచి జూలై 15 వరకు విత్తనం వేసేందుకు అనుకూలమన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

తలుపుల: మండల కేంద్రంలోని వ్యవసాయ గోదాము వద్ద ఏఓ షాదాబ్, ఎంపీడీఓ మహబుబ్ ఖాన్, ఎస్‌ఐ దిలీప్‌కుమార్ బుధవారం రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. రిజిస్ట్రేషన్ చేయించుకొన్న రైతులకు ఆయా ఆర్బీకేలలో 1,300 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ చేసినట్లు ఏఓ తెలిపారు.

ధర్మవరం రూరల్: పోతుకుంట రైతు భరోసా కేంద్రంలో చేపట్టిన విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఏడీఏ కృష్ణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతు ధర్మవరం మండలంలో 2,513 మంది రైతులు 2,233 క్వింటాళ్ల వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. సబ్సిడీ విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ ముస్తఫా, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: విత్తన వేరుశనగను సద్వినియోగం చేసుకోవాలని సీఐ యతీంద్ర రైతులకు సూచించారు. బుధవారం స్థానిక వ్యవసాయ గోదాములో ఆయన ఏఓ లక్ష్మీనరసింహులుతో కలిసి రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. వ్యవసాయ సిబ్బంది షరీఫ్, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రైతు భరోసా కేంద్రంలో బుధవారం సబ్సిడీ విత్తనకాయలను పట్నం ఎస్‌ఐ నరసింహుడురైతులకు పంపిణీ చేశారు.

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం విత్తన వేరుశనగ పంపిణీ సజావుగా జరిగినట్లు ఏఓ కృష్ణకుమారి తెలిపారు. తొలిరోజు ముత్తవకుంట్ల, మద్దెలచెరువు, భానుకోటలో గ్రామాల్లో 120 క్వింటాళ్ల విత్తన కాయలను రైతులకు పంపిణీ చేసినట్లు ఆమె వెల్లడించారు. మండలంలోని 12 ఆర్బీకేల్లో ఇప్పటివరకు 1,545 మంది రైతులు 1,388 క్వింటాళ్ల విత్తనం కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. తొలి విడతగా మండలానికి 1,700 క్వింటాళ్ల విత్తనాన్ని అధికారులు కేటాయించారని, గురువారం నుంచి అన్ని ఆర్బీకేల్లో విత్తనం పంపిణీ చేస్తామని తెలిపారు.



గాండ్లపెంటలో విత్తన పంపిణీని ప్రారంభించిన ఎంపీడీఓ



ఎన్పీకుంటలో వేరుశనగ అందిస్తున్న తహసీల్దార్ నరేంద్రకుమార్



తనకల్లులో విత్తన కాయలను అందిస్తున్న అధికారులు



ముదిగుబ్బలో విత్తన కాయలను పంపిణీ చేస్తున్న అధికారులు

మెనూ ప్రకారం భోజనం అందించాలి



తాడిమర్రిలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



కొత్తచెరువులో వంట మనిషికి బహుమతి ప్రదానం చేస్తున్న ఎంఈఓ జయచంద్ర

తాడిమర్రి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓలు కృష్ణమోహన్, వెంకటేష్‌లు ఏజెన్సీ నిర్వాహకులకు ఆదేశించారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం వారు ఏజెన్సీ నిర్వాహకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ముందుగా ఆర్పీ సుజాత కూరలు, తాలింపు, కిచిడి తదితర ఆహార పదార్థాలను రుచిగా ఎలా వండాలో వివరించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ తాజా కూరగాయలు, ఆకుకూరలు, నాణ్యమైన సరుకులతో భోజనం రుచిగా, శుచిగా వండాలన్నారు. అలాగే వంటశాలలు, వంట పాత్రలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ కిరణ్‌కుమార్, సీఆర్పీలు గోపాల్‌రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు ఎంఈఓలు జయచంద్ర, రెడ్డెప్ప సూచించారు. బుధువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు, వంట మనుషులు, హెల్పర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ జయచంద్ర వారికి పలు సూచనలు చేశారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎంలు వెంకటరమణ, వెంకటేష్, సిబ్బంది ముకుందరెడ్డి పాల్గొన్నారు.

పుట్టపర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీఓ–2 ప్రసాద్ ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. బుధవారం ఆయన ఏడీ రామకృష్ణతో కలిసి పుట్టపర్తి శివాలయం వీధి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన భోజన ఏజెన్సీ సభ్యులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు మెనూ మేరకు భోజనం అందించాలన్నారు. భోజనం ఎలా వండాలనే విషయంపై శిక్షణ ఇచ్చారు. వంట సామగ్రి ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎం వెంకటరత్నం, సాయి గ్లోబెల్ పాఠశాల అధినేత శంకర్‌నారాయణ, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.



ధర్మవరంలో సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు

ధర్మవరం అర్బన్: నాణ్యమైన భోజన తయారీపై ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్ తెలిపారు. పట్టణంలోని సుందరయ్యనగర్ గణేష్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు భోజన తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ పిల్లలకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఎలా చేయాలి, పదార్థాలు ఎంత మోతాదులో వాడాలి తదితర వాటిపై శిక్షణనిచ్చామన్నారు. అనంతరం కుకింగ్ కాంపిటీషన్స్‌లో లక్ష్మీదేవి, రత్నమ్మ, మంజరికి బహుమతులు అందజేశారు.

కౌంటింగ్ సమయంలో హద్దు మీరితే ఉపేక్షించం



మాట్లాడుతున్న డీఎస్పీ బాజీజాన్ సైదా

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయంలో అల్లరి మూకలు హద్దు మీరితే కాల్పులు జరపడం ఖాయమని పెనుకొండ డీఎస్పీ బాజీజాన్ సైదా హెచ్చరించారు. ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. బుధవారం సాయంత్రం డీఎస్పీ నేతృత్వంలో పోలీసులు ప్రత్యేక బలగాలతో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ అనంతరం శాంతియుత వాతావరణం నెలకొనాలన్నారు. అల్లరి మూకలు రెచ్చిపోయి విధ్వంసకర ఘటనలకు పాల్పడితే కాల్పులు జరపడం ఖాయమన్నారు. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గమనించాలని, జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఈ హెచ్చరికలు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ముగిసిన చిన్నమ్మ దేవత పరుష



పూజలందుకున్న చిన్నమ్మ దేవత



రంగుల రాట్నంపై తిరుగుతున్న చిన్నారులు



జారుడు బల్లపై చిన్నారులు

నల్లమాడ: వంకరకుంట సమీపాన తుమ్మలామల దుర్గంలో వెలసిన మహిమాన్వితురాలు పసిబాల చిన్నమ్మ దేవత పరుష బుధవారం కుంకాలు కార్యక్రమంతో ముగిసింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని కాయ, కర్పూరం సమర్పించారు. గురువారం వంకరకుంట నుంచి చిన్నమ్మ దేవత పుట్టినిల్లు అయిన ఓడీచెరువు మండలం బత్తినపల్లికి తరలిపోనున్నట్లు పూజారులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు మక్బూల్ పరామర్శ



సయ్యద్‌హుస్సేన్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బీఎస్ మక్బూల్ అహ్మద్

గాండ్లపెంట: కటారుపల్లిలో మంగళవారం ఉప సర్పంచ్ సయ్యద్‌హుస్సేన్, బొలిగుట్టపల్లిలో పాత నారాయణరెడ్డి కుమారుడు పాత లక్ష్మీరెడ్డి(37) గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ బుధవారం ఆయా గ్రామాలకు చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మండల కేంద్రంలో కిందపడి గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మహ్మద్‌అలీ ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మంగళవారం బైక్‌పై నుంచి కింద పడిన వంకపల్లికి చెందిన మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, ప్రభాకర రెడ్డిని ఆయన పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల ఇన్‌చార్జ్ శ్రీకాంత్‌రెడ్డి, కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, జేసీఎస్ కన్వీనర్ పోరెడ్డిచంద్రశేఖరరెడ్డి, రాష్ట్ర బీసీ కార్యదర్శి జక్కల నరసింహగౌడ్, నాయకులు చాను, వద్దిరెడ్డిక్రిష్టారెడ్డి, ఉత్తన్న, హరిప్రసాద్‌రెడ్డి, రామకృష్ణ, వెంకటరెడ్డి, మాజీ డైరెక్టర్లు పురుషోత్తంరెడ్డి, ఫారూక్, మాజీ సర్పంచ్‌లు గంగాధర్, హుస్సేన్‌పీరా, ఇక్బాల్, మాజీ జెడ్పీకోఆప్షన్ సభ్యుడు సీఎస్ అబ్దుల్ రవూఫ, నాగార్జునరెడ్డి, రవీంద్రారెడ్డి, వేమయ్య ఉన్నారు.

31న జిల్లా జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో ఈ నెల 31న శ్రీసత్యసాయి జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా జూనియర్ బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్, కార్యదర్శి మహమ్మద్ సలీమ్ బుధవారం తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2009 నుంచి డిసెంబర్ 31, 2010 మధ్యలో జన్మించి ఉండాలన్నారు. అలాగే క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, పీసీఎంఏ సర్టిఫికెట్, తల్లిదండ్రుల సమ్మతి పత్రం(కన్సెంట్ ఫారం) తీసుకురావాలని సూచించారు.

వ్యక్తికి గాయాలు

నల్లచెరువు: స్కూటీ అదుపుతప్పి కింద పడడంతో బుధవారం ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. కె.పూలకుంట గ్రామానికి చెందిన నరసింహారెడ్డి వ్యక్తి గత పనుల నిమిత్తం మండల కేంద్రానికి బయలుదేరాడు. అయితే గ్రామ సమీపంలోని మిట్ట వద్ద రోడ్డుపై మట్టి ఉండడంతో అతను ప్రయానిస్తున్న స్కూటీ అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో నరసింహారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించారు.

గొడవలు చేస్తే రౌడీషీట్

- ఎస్‌ఐ వెంకటేశ్వర్లు హెచ్చరిక

చెన్నేకొత్తపల్లి: మండలంలో 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, ఎవరైనా హద్దు మీరితే కఠినంగా వ్యవహరిస్తామని చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుందని, ఆ రోజు, ఫలితాల వెల్లడి తర్వాత మండలంలో ఎలాంటి గొడవలకు తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. అల్లర్లు, ఘర్షణకు ప్రేరేపించే అరాచక శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామన్నారు. రౌడీషీట్ కూడా ఓపెన్ చేయడంతో పాటు జిల్లా బహిష్కరణ కూడా చేస్తామన్నారు. మండల పరిధిలోని పెట్రోల్ బంకుల్లో లూజుగా డీజిల్, పెట్రోల్ విక్రయాలు నిషేధించామన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూన్ 6వ తేదీ వరకూ మండలంలో ఎక్కడా బాణాసంచా విక్రయించరాదని, వినియోగించరాదన్నారు. మండలంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు మండల ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా మారెమ్మ జాతర

నల్లచెరువు: బాలేపల్లి తండాలో బుధవారం మారెమ్మ జాతర ఘనంగా జరిగింది. ఈసందర్భంగా అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కదిరి ఎన్నికల ఇంచార్జ్ పూల శ్రీనివాసరెడ్డి, బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బత్త వెంకటరమణ, జెడ్పీటీసీ అనిత బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు, సింగిల్‌విండో అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ సింగల్‌విండో అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, సీనియర్ నాయకులు కె.రమణారెడ్డి, కల్లిపల్లి శ్రీనివాసులు, జేసీఎస్ మండల కన్వీనర్ షమీవుల్లా సేవాదల్ జోనల్ ఇంచార్జ్ రవికుమార్‌రెడ్డి, మైనార్టీ విభాగం కార్యదర్శి నజీర్, రైతు విభాగం కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే సర్పంచ్ సోనాలమ్మ, హైటెక్ రమణ నాయక్ ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యారు.